


లోపలి పేజీల్లో...
సీతారామ ప్రాజెక్టు నీళ్ల కోసం ఉద్యమం
రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ 7
పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలి
బీఎంఎస్ ప్రతినిధి బృందంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి 7
హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



జయహో సిందూర్

ఉగ్రవాదుల శిబిరాలపై మెరుపు దాడులతో ప్రజల్లో హర్షాతిరేకాలు

- పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలి
- మత ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని విజ్ఞప్తి
- భారత సేనల చర్యలకు పూర్తి మద్దతు ప్రకటించిన భిన్న వర్గాలు



పాకిస్థాన్‌తో పాటు, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సేనలు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో మెరుపు దాడులు చేపట్టడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి గట్టిగా గుణపాఠం చెప్పాలని భిన్నవర్గాల వారు కోరుతున్నారు. సైన్యం జరిపిన దాడుల దృశ్యాలను టీవీల్లో, యూట్యూబ్‌ల్లో చూస్తూ సంబరాలు జరుపుకొన్నారు. ఎక్కడ నలుగురు గుమిగూడినా 'ఆపరేషన్ సిందూర్' గురించిన చర్చలే కనిపించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలు గత ఐదు దశాబ్దాలుగా భారత్‌కు తలనొప్పిగా మారాయని, ఈ సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. మత ఉగ్రవాదంతో అమాయకులను పొట్టన పెట్టుకోవడం హేయమని, ఇది మానవత్వానికే మచ్చ అని విమర్శిస్తున్నారు. సైన్యానికి, మోదీకి ఆశీస్సుల కోసం వైరాలోని సాయిబాబా మందిరంలో బీజేపీ నేతలు యాగం నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ నేతలు ఖమ్మంలో మీడియా సమావేశంలో భారత సేనలకు పూర్తి మద్దతు ప్రకటించారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

వివరాలు : 6లో


కొత్తగూడెంలో సంబరాలు నిర్వహించిన బీజేపీ శ్రేణులు


వైరాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి కొత్తకళ రాబోతోంది. రూ.166 కోట్లతో ప్రభుత్వ ఖమ్మం మెడికల్ కళాశాలకు నూతన భవనాలు నిర్మిస్తోంది. ఈ కళాశాలకు 35 ఎకరాల్లో అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మించాలని సంకల్పించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పట్టుదలతో మంజూరు చేయించారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం బాలప్పేట బైపాస్ రోడ్డు సమీపంలో గురువారం ఉదయం 10 గంటలకు కళాశాల భవనాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మెడికల్ కాలేజీకి చెందిన జిల్లా ఆస్పత్రిని సందర్శిస్తారు. ఆ తరువాత ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశానికి మంత్రులు హాజరవుతారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల



వైద్య కళాశాలకు మహర్దశ

- మంత్రి తుమ్మల చొరవతో శాశ్వత భవనాలు మంజూరు
- రఘునాథపాలెం సమీపంలో 35 ఎకరాల్లో రూ.166 కోట్లతో నిర్మాణం
- ఇప్పటికే ప్రారంభమైన నిర్మాణ పనులు
- నేడు అధికారికంగా శంకుస్థాపన
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, రాజనర్సింహ, పొంగులేటి
- పర్యటనలో జిల్లా ఆస్పత్రి సందర్శన.. కలెక్టరేట్‌లో సమీక్ష



ఖమ్మం, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం ప్రభుత్వం మెడికల్ కళాశాల 2022లో మంజూరు కాగా, 2023లో తాత్కాలిక భవనాల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సర విద్యాబోధన జరుగుతోంది. వంద ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభమైన ఈ కళాశాలకు ఖమ్మం జిల్లా ఆస్పత్రిని అనుసంధానం చేసి పాత కలెక్టరేట్‌ను కాలేజీగా మార్చి నడిపిస్తున్నారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ కాలేజీకి అధునాతన వసతులతో శాశ్వత భవనాలు ఉండాలని సంకల్పించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాకు సరిహద్దులోనే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీతోపాటు పొరుగునే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు ఖమ్మం ప్రధాన హెల్త్‌సెంటర్‌గా ఉన్నందున నిత్యం వేలాదిమంది ఖమ్మం నగరానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలో ప్రత్యేక వసతులతో మెడికల్ కాలేజీ నిర్మిస్తే భవిష్యత్తులో పీజీ కాలేజీగా అభివృద్ధి చేసి సూపర్‌స్పెషాలిటీ సేవలు అందించేలా మంత్రి తుమ్మల చొరవ తీసుకుని 35 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు రూ.166కోట్ల నిధులు మంజూరు చేయించారు. అయితే కళాశాల అవసరాల దృష్ట్యా ఇప్పటికే నూతన భవనాల నిర్మాణం ప్రారంభం కాగా అధికారికంగా గురువారం శంకుస్థాపన చేయనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

రఘునాథపాలెం (ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నూతన భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. మెడికల్ కాలేజీ నిర్మాణంపై కాంట్రాక్టర్‌తో (మిగతా 6వ పేజీలో)



నగరానికి రింగ్ రోడ్డు

- ఖమ్మం-కురవి, అమరావతి-నాగపూర్ హై వేల అనుసంధానంతో సాకారం 6
- రింగ్ రోడ్డుతో మారనున్న ఖమ్మం నగర స్వరూపం
- అభివృద్ధే ఆశయంగా పనిచేస్తున్నా: మంత్రి తుమ్మల

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సమస్యల తిష్ట | వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహపైనే ఆశలు 7



నేలకొరిగిన 'అల్లూరి'

పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల క్యాంపులపై భారత్ యుద్ధభేరి మోగించిన తరుణంలో... ఇల్లెందు మండలం పోలారం గ్రామంలో దేశభక్తిని రగిలించే సన్నివేశం చోటుచేసుకుంది. ఆనాడు దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షిస్తూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు పోలారంలో ప్రత్యక్షమయ్యాడు. గిరిజనులతో కలిసి సాయుధ పోరాటంతో బ్రిటిష్ అధికారులను గడగడలాడించిన అల్లూరి... వారి తుపాకీ గుండ్లకు బలైపోయాడు. ఆనాటి ఘట్టాన్ని పోలారం సెంటర్‌లో సజీవంగా ఆవిష్కరించారు అరుణోదయ కళాకారులు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బుధవారం వారు ప్రదర్శించిన వీధినాటిక భావోద్వేగాలను కలిగించింది. ప్రాణం కన్నా దేశమే ముఖ్యమనే సందేశాన్ని బలంగా వినిపించింది. ఈ సందర్భంగా పోలారంలో నిర్వహించిన వర్ధంతి సభలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు నాయని రాజు, ఆజ్మీరా బిచ్చా, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు వాంకుడోత్ అజయ్ మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటస్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం కోటయ్య, పూనెం కుమార్, గాంధీ, రాంబాబు, చంద్రశేఖర్, కిరణ్, వీరభద్రన్న, దేవా, శంకర్, శాంతారావు, రాఘవులు, సావిత్రి, ముత్తక్క పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, ఇల్లెందు రూరల్


భద్రాచలం లైబ్రరీలో రీడింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- పేదవాడికి భద్రత కల్పించేందుకు రాజీ పడేది లేదు
- మంత్రి పొంగులేటి
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం, ప్రారంభోత్సవాలు
- ఏజెన్సీ మండలాల్లో సుడిగాలి పర్యటన

భద్రాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగోలేకపోయినా.. గత 16 నెలల్లో అభివృద్ధి సంక్షేమం మా ప్రభుత్వానికి రెండు కళ్లుగా పని చేస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఏజెన్సీ మండలాల్లో మంత్రి పొంగులేటి బుధవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. తొలుత వాజేడులో ప్రారంభమైన పర్యటన అనంతరం వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలంలో సాగింది. ఈ సందర్భంగా భద్రాచలంలో విలేకరులతో (మిగతా 6వ పేజీలో)

ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైతుల ఆగ్రహం

- జాప్యాన్ని నివారించాలని, తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్
- తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో రాస్తారోకో
- జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు


తల్లాడలో రాస్తారోకో చేస్తున్న రైతులు

తల్లాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్న క్రమంలో.. ధాన్యం రాశులు అకాల వర్షాల బారిన పడుతుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు రోడ్డెక్కారు. మండుటెండలో బైఠాయించి జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. దీంతో వందలాది వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. బుధవారం తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో రైతులు రాస్తారోకో చేశారు. మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాలవర్షానికి మండలంలో కుర్నవల్లి కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం అయింది.

ఈ క్రమంలో ప్రభుత్వం తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని గన్నీసంచులు, ఎగుమతికి లారీలు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. దీంతో తల్లాడ-దేవరపల్లి, తల్లాడ వరంగల్, తల్లాడ-కుంట జాతీయ రహదారుల్లో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. రాస్తారోకో వద్దకు ట్రెయినీ ఎస్ఐ వెంకటేష్, పోలీసు సిబ్బందితో కలిసి విరమింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు తహసీల్దార్ వచ్చి హామీ ఇచ్చేవరకు కొనసాగిస్తామని రైతులు తేల్చి చెప్పారు.

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో జరుగుతున్న నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం నీటి పాలైందన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, గన్నీసంచులు, లారీలు సకాలంలో సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు వారాలుగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టినప్పటికీ కొనుగోలులో జాప్యం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే, ఆర్డీవో, సివిల్ సప్లయ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రతి గింజ కొంటాం, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదన్నారు.

తేమశాతం తక్కువగా ఉన్నా.. గన్నీసంచులు సకాలంలో ఇవ్వకుండా, కాంటాలు వేసిన బస్తాలు లారీల్లో పంపకుండా కాలయాపన చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో వద్దకు తహసీల్దార్ సురేష్‌కుమార్ వచ్చి (మిగతా 6వ పేజీలో)

ఆఫ్‌టైప్ మొక్కల బాధిత రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి

అశ్వారావుపేట రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఐదారేళ్ల ఎంతో శ్రమించి పెంచిన పామాయిల్ తోటల్లో ఆఫ్‌టైప్ మొక్కలు ఎక్కువగా వచ్చాయని, పూతకాత లేని మొక్కలతో నష్టపోయిన బాధిత రైతాంగానికి ఆయిల్‌ఫెడ్ అధికారులు, ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని నారంవారిగూడెంలోని పామాయిల్ డివిజనల్ కార్యాలయం వద్ద బుధవారం సంఘం నాయకులు ఆఫ్‌టైప్ మొక్కల బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం స్వయంగా ఆయిల్‌ఫెడ్ చైర్మన్ తోటలను పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారని, అయినా నష్టపరిహారం ఇవ్వటం కుదరదని చెప్పటం దారుణమన్నారు. ఆయిల్‌ఫెడ్ నర్సరీలో కాంట్రాక్టర్ వ్యవస్థని అడ్డం పెట్టుకుని కర్లింగ్ మొక్కలను రైతులకు అందించిన అధికారులపైనా, కాంట్రాక్టర్‌పైనా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేని కారణంగా మొక్కలు వేయటానికి ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం కొంత వెసులుబాటు ఇచ్చి తోటలు వేసుకునేలా చూడాలని కోరారు.సమావేశంలో సంఘం నాయకులు చెలికాని సూర్యారావు, వెంకట్రావు, దామోదరరెడ్డి, శ్రీరాములు, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్లు ఇస్తే సస్పెండే..

అధికారులకు మంత్రి పొంగులేటి హెచ్చరిక

దుమ్ముగూడెం, మే 7 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తే ఎంక్వైరీ చేసి జాబితా తయారు చేసిన అధికారులు సస్పెండ్ అవుతారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. చిన బండిరేవులో ఈజీఎస్ నిధులు రూ.74.50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రహదారులతోపాటు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను బుధవారం ప్రారంభించారు. అర్హులు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా చూడాలని, అనర్హులను గుర్తిస్తే సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను ఆదేశించారు. తొలి ప్రాధాన్యత పూరి గుడిసెల్లో ఉన్న పేద వారికి మాత్రమేనని, అవకాశం ఉంటే ద్వితీయ ప్రాధాన్యతను రేకుల ఇళ్లలో ఉన్నవారికి కల్పించాలన్నారు. సింగారంలో రూ.4.50కోట్ల సీఆర్ఆర్ నిధులతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.



దుమ్ముగూడెంలో సీసీ పనులు ప్రారంభిస్తూ..

అర్హత కలిగి ఉండి తమకు ఇళ్లు రాలేదని పెదనల్లబల్లి, చినబండిరేవులకు చెందిన పలువురు మహిళలు మంత్రికి విన్నవించారు. స్థానిక సమస్యలపై చినబండిరేవులో సీపీఎం నాయకులు, నరసాపురంలో సీపీఐ నాయకులు మంత్రికి వినతిపత్రాలందజేశారు. తండ్రిని కోల్పోయిన కాంగ్రెస్ నాయకుడు పూజారి సూర్యచంద్రరావును పరామర్శించారు. ఎమ్మెల్యే డాక్టరు తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, ఏఎంసీ చైర్మన్ సీతమ్మ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీవో బి.రాహుల్, హౌసింగ్ పీడీ శంకర్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ జడ్పీటీసీ అన్నె సత్యనారాయణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

చర్ల (ఆంధ్రజ్యోతి):పేదవాడి సొంత ఇంటి కల ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.



చర్ల మండలం తేగడలో భూమి పూజ చేస్తున్న పొంగులేటి

బుధవారం చర్ల మండలంలో ఆయన పర్యటించారు. ముందుగా ములుగు జిల్లా వెంకటాపురం నుంచి చర్ల మండలం సుబ్బంపేట చేరుకున్న మంత్రి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వాసం ముసలయ్య అనే గిరిజనుడి ఇంటికి చేరుకుని సన్నబియ్యంతో భోజనం చేశారు. అనంతరం చర్ల మండలం లక్ష్మి కాలనీలో రూ.కోటి 16లక్షల ఖర్చుతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం తేగడ గ్రామంలోని పుల్లరి సుధాకర్, సరోజిని దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి పలువురు పలు సమస్యలను తీసుకొచ్చి, వినతి పత్రాలు అందజేశారు. మంత్రి వెంట భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, చర్ల మండల నాయకులు నల్లపు దుర్గా ప్రసాద్, చీమల మర్రి మురళీకృష్ణ, ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, జవ్వాది రవి, బండారు రామకృష్ణ, ఈశ్వర్, వినోద్, భద్రం, ఇతర నాయకులు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణ సేవలు మెరుగు పడాలి

డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరోగ్య సంరక్షణ సేవలు మెరుగుపడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. బుధవారం ఐడీవోసీలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులు, పీహెచ్‌సీ పర్యవేక్షణ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఆరోగ్య సంరక్షణ సేవలో మెరుగుపరచడం లక్ష్యంగా అనేక కీలక కార్యక్రమాలపై దృష్టి సారించేలా పని చేయాలన్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల ఆవశ్యకతను, వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడానికి సోకేజ్ పిట్‌ల నిర్మాణం గురించి చర్చించారు. పీహెచ్‌సీలో డెలివరీ శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. సిజేరియన్ ప్రసవాల రేటును తగ్గించడానికి సాధ్యమైన చోట సహజ ప్రసవాలను ప్రోత్సహించడానికి చర్యలను చేపట్టాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మధువరన్, డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ పుల్లారెడ్డి, డిప్యూటీ డెమో ఫైజ్ మొహినుద్దీన్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఏర్పాట్లపై కలెక్టర్ తనిఖీ

- వైద్య కళాశాల శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తి
- డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యకళాశాల నూతన భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం, మంత్రుల పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని తనిఖీ చేశారు. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన ఏర్పాట్లను అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, మాతా శిశు సంరక్షణ కేంద్రం, జిల్లా ఆస్పత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నేడు జిల్లాలో వైద్యారోగ్యశాఖ సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ పర్యటనలో ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలకు శంకుస్థాపన అనంతరం బహిరంగసభలో పాల్గొని, తర్వాత ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శిస్తారని తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. మంత్రుల సమీక్ష నేపథ్యంలో అధికారులు సన్నద్ధం కావాలని ఆదేశించారు. పూర్తి వివరాలతో హాజరుకావాలని ఆయన సూచించారు. ఖమ్మం జిల్లా ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, స్టాఫ్, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రతిపాదనలు సిద్ధం చేసుకొని వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఇంకా మైకంలోనే ఉన్నారు..

- అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి కనిపించటం లేదు
- ఖమ్మం నియోజకవర్గ పీసీసీ పరిశీలకుడు బత్తిని శ్రీనివాసరావు
- నామినేటెడ్ పదవులపై పార్టీదే తుది నిర్ణయం: మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 7(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 15నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు కనిపించటం లేదని, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే ప్రతి నాయకునికి గుర్తింపు ఉంటుందని, అలాగే కార్యకర్తలకు అండగా నిలుస్తొందని ఖమ్మం నియోజకవర్గ పీసీసీ అబ్జర్వర్ బత్తిని శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలోని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఖమ్మం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సమావేశంలో మాట్లాడారు. పార్టీలో అన్ని కులాలను కలుపుకుంటూ సమన్వయంతో పదవులు ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించే వారికి, ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టే వారికి సరైన అవకాశాలు ఉంటాయని వివరించారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయలేదని అనేక సంక్షేమ పథకాలను 15నెలల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు.

ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఏ ఒక్కరికి పదవులు ఇవ్వాలని సిపార్సులు చేయబోనని, పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించి పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాహుల్‌గాంధీ సూచించిన వారికే పదవులు అందుతాయని, ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. ప్రజలకు, పార్టీకి ప్రయోజనం కలిగేలా నాయకులు పనితీరు ఉండాలని కోరారు. కష్టపడి పని చేసిన వారికి ఖచ్చితంగా పదవులు దక్కుతాయన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, డిప్యూటీ మేయర్ పాతిమాజోహరా, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, కాంగ్రెస్ కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.

జయహో 'సిందూర్'

- భారత్ జోలికిస్తే సహించేది లేదు..
- అవసరమైతే పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధం
- బాధిత మహిళల కన్నీటి కెరటమే 'ఆపరేషన్ సిందూర్'
- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి

వైరా, మే 7 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో సిందూరాన్ని కోల్పోయిన మహిళల కన్నీటి కెరటమే పాకిస్థాన్ భూ భాగంలోని ఉగ్రవాదులను హతమార్చిన ఆపరేషన్ సిందూర్ అని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. భారత దేశం జోలికొస్తే సహించేది లేదని అవసరమైతే పూర్తిస్థాయి యుద్ధానికైనా సిద్ధమేనని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వైరాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో సాయిబాబా మందిరంలో సుధాకర్‌రెడ్డి పూజలు చేశారు. సైన్యానికి, మోదీకి ఆశీస్సుల కోసం సాయిబాబా మందిరంలో యాగం నిర్వహించారు. అనంతరం కామిశెట్టి కల్యాణ మండపంలో జరిగిన జనగణన, కులగణన అంశంపై అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు.

దేశ సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న నరేంద్రమోదీతోపాటు దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ ఆపరేషన్ సిందూర్ లాంటి కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న సైనికులకు మనోధైర్యంతోపాటు ఆశీస్సులందించాలని యాగం, పూజలు నిర్వహించామని తెలిపారు. దేశపౌరుల జోలికొస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమనేలా ప్రధాని మోదీ చర్యలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి మోదీ భారతదేశం సత్తా చాటారని కొనియాడారు. పాకిస్థాన్‌తోపాటు ఆ దేశానికి సహకరిస్తున్న చైనా, శ్రీలంక దేశాలు కూడా బుద్ధిగా ఉండాలని లేనిపక్షంలో తీవ్ర మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రధాని మోదీతోపాటు భారత సైనికుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. దేశ రక్షణ, సైనికుల సంక్షేమం కోసం కృషిచేస్తామని పార్టీ కార్యకర్తలతో సుధాకర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. అనంతరం జిల్లాలోని పది మండలాలకు నూతనంగా నియమితులైన బీజేపీ మండల అధ్యక్షులను సుధాకర్‌రెడ్డి, నెల్లూరి కోటేశ్వరరావు సన్మానించారు. నాయకులు సన్నే ఉదయ్‌ప్రతాప్, నున్నా రవికుమార్, మందడపు సుబ్బారావు, అల్లిక అంజయ్య, మనుబోలు వెంకటకృష్ణ, దొడ్డా అరుణ, నల్లగట్ల ప్రవీణ్, కల్యాణం రామారావు పాల్గొన్నారు.



వైరాలో మోదీ చిత్రపటానికి క్షీరభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆపరేషన్ సిందూర్ అభినందనీయం

మాజీ ఎంపీ నామా

ఖమ్మం సాంస్కృతికం, మే 7 (ఆంధ్రజ్యోతి) : పహల్గాం దాడికి కారణమైన ఉగ్ర మూకలను మట్టు పెట్టేందుకు భారత సైన్యం బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ చేపట్టడం అభినందనీయమని లోక్‌సభలో బీఆర్ఎస్ పక్ష మాజీ నేత, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. దేశ ప్రజల భద్రతకు భారత సైన్యం ఎంత ప్రాధాన్యతనిస్తుందో ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి చాటికి చెప్పిందన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో తిష్ట వేసిన ఉగ్ర వాదులను ఏరివేసేందుకు భారత త్రివిధ దళాలు చర్యలకు ఉపక్రమించి విజయవంతంగా లక్ష్యాలను పూర్తి చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్ రీ ఆర్గనైజేషన్ సవరణ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పుడు తమ నాయకుడు కేసీఆర్ సూచన మేరకు, తాను ఆనాడు బీఆర్ఎస్ పక్షనేతగా బిల్లుకు మద్దతు తెలపటంతోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఇండియన్ కశ్మీర్‌గా చేయాలని కోరానని తెలిపారు.

జై భారత్.. జై హింద్...

కొత్తగూడెంలో విజయోత్సవ ర్యాలీ

లక్ష్మీదేవిపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): భారత్ సేనలు మంగళవారం అర్ధరాత్రి ఉగ్రవాదుల శిబిరాలపై మెరుపు దాడి చేసి నేలమట్టం చేయడాన్ని పురస్కరించుకుని బుధవారం కొత్తగూడెం సూపర్‌బజారు సెంటరులో బీజేపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మోదీ నేతృత్వంలో భారత ఆర్మీ ఏకకాలంలో పాకిస్థాన్ ఉగ్రవాదుల స్థావరాలపై బాంబులతో దాడి చేసి ప్రముఖ ఉగ్రవాదులను హతమర్చడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. జై భారత్.. జై హింద్ నినాదాలతో హోరెత్తించారు. టెర్రరిస్టులు ఎవరైనా సరే భారత్ జోలికొస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ శీలం విద్యాసాగర్, పైడిపాటి రవీందర్, నాగేశ్వరరావు, బలగం శ్రీధర్, రాంబాబు, కృష్ణారెడ్డి, వేణు, భీమాల్, సలీం,కిరణ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సలామ్.. కల్నల్ సోఫియా ఖురేషి!

కాంగ్రెస్ నేత ఆళ్ల మురళి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ఆపరేషన్ సిందూర్ పేరుతో ధ్వంసం చేయడం గర్వకారణమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ఆళ్ళ మురళి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆపరేషన్‌కు ప్రాతినిధ్యం వహించిన కల్నల్ సోఫియా ఖురేషి వైపు యావత్ భారత దేశం చూస్తోందని హర్షం వ్యక్తం చేశారు. పాకిస్థానీలను భారత సైనికులు మట్టి కరిపించారని, ఈ ఆపరేషన్‌తో భారత్‌పై ఎవరు దాడి చేయాలని ఆలోచించినా, దాడి చేసినా భారత ఆర్మీ సైన్యం ఊరుకోదని తుద ముట్టిస్తారనే హెచ్చరికను జారీచేసినట్లు అయిందని అన్నారు.

పాకిస్థాన్‌పై పోరుకు పూర్తి మద్దతు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మం మార్కెట్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులను తయారు చేస్తూ, ప్రపంచం నలుమూలలా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఎంతో మంది ప్రాణాలకు హాని కలిగిస్తున్న పాకిస్థాన్‌పై పోరు కొనసాగిస్తున్న భారత రక్షణ బలగాలకు బీఆర్ఎస్ తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పేర్కొన్నారు. నగరంలోని తెలంగాణ భవన్ లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పాకిస్థాన్ ఉగ్రవాదుల తయారీ ఫ్యాక్టరీగా తయారైందని అన్నారు. బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పడిన దగ్గర్నుంచి పాకిస్థాన్ మన దేశంలో కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని, ప్రజల ప్రాణాలను, ఆస్తులను ధ్వంసం చేయడమే ఎజెండాగా పని చేస్తోందని విమర్శించారు.

పాకిస్థాన్ దేశ అధికారులు, మంత్రులే స్వయంగా తమ దేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని అనేక సందర్భాలలో బహిరంగంగా చెప్పుకున్నారని అన్నారు. ఆ దేశ ఉగ్రవాదుల దుశ్చర్యల మూలంగా మన దేశంలో సామాన్య పౌరులు, సైనికులు ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఈనెల 9న తల్లాడ మండలం మిట్టపల్లిలో కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కొండబాల కోటేశ్వరరావు, బాణోత్ చంద్రావతి, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు బెల్లం వేణు, బొమ్మెర రామ్మూర్తి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు

వైద్య కళాశాలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడారు. భవనాల నిర్మాణం, మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసి ఆగస్టులో ప్రారంభానికి ఇవ్వాలని ఆదేశించారు. ఆగస్టు 15న ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విద్యార్థులు జాతీయజెండాను ఎగురవేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన కాంట్రాక్టర్ జూలై చివరి నాటికే ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేసి ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు రెవెన్యూ అధికారులు సరైన న్యాయం చేయాలని ఆర్డీవో నర్సింహారావును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్‌తో సమీక్షించారు. వీవీపాలేం సొసైటీ చైర్మన్ సైదుబాబు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైతుల ఆగ్రహం

(5వ పేజీ తరువాయి)

కుర్నవల్లిలోని కొనుగోలు కేంద్రాలకు 20 వేల గన్నీసంచులు, నాలుగు లారీలు పంపిస్తామని మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య, పులి కృష్ణయ్య, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, కట్టా దర్గయ్య, అయిలూరి చలపతి రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

నగరానికి రింగ్ రోడ్డు

ఖమ్మం, మే 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు రాబోతోంది. ప్రస్తుతం నిర్మిస్తున్న జాతీయ రహదారులతోనే ఈ రింగ్ రోడ్డు సౌకర్యం కలగబోతోంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ రహదారుల నిర్మాణానికి చొరవ తీసుకుంటూనే ఆ జాతీయ రహదారులను అనుసంధానం చేసేలా రింగ్ రోడ్డుకు రూపకల్పన చేశారు. గతంలో చేసిన ప్రతిపాదనలను ఇటీవల కేంద్ర ఉపరితల రవాణశాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి అందించడంతో పాటు రింగ్‌రోడ్డు అనుసంధానంపై మ్యాప్‌ను చూపించి దానికి అవసరమైన రూ.125కోట్లు మంజూరుచేయాలని సూచించారు. దాంతో కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణం రూ.2,373కోట్లతో పూర్తి కాగా గతంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడే మంత్రి తుమ్మల ఈ హైవేకు రూపకల్పన చేసి గడ్కరీ ద్వారానే మంజూరు చేయించారు.

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌హైవే రూ.1,826 కోట్లు, అమరావతి-నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్‌హైవే రూ.2,006కోట్లు, ఖమ్మం-కొరివి జాతీయరహదారి రూ.446కోట్లతో పనులు జరుగుతున్నాయి. అయితే ఖమ్మం-కొరివి జాతీయ రహదారికి, అమరావతి-నాగపూర్ జాతీయ రహదారికి మధ్య ఖమ్మంరూరల్ మండలం కాసిరాజుగూడెం నుంచి రఘునాధపాలెం వరకు సుమారు 6.8కి.మీ గ్యాప్ ఉండడంతో దీన్ని కూడా హైవేగా మారిస్తే ఖమ్మం నగరానికి తక్కువ ఖర్చుతో రింగ్‌రోడ్డు ఏర్పడుతుందని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల సూచించడంతో అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. దీనికి సంబంధించిన అన్ని ప్రతిపాదనులు అందించడంతో త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఈ రహదారి మంజూరైతే ఖమ్మం-కొరివి, నాగపూర్-అమరావతి జాతీయ రహదారులు అనుసంధానం అవుతాయి. మున్నేరుపై మరో లోలెవల్ వంతెన కూడా నిర్మాణం జరగనుంది. ఇది పూర్తయితే ఖమ్మం నగరానికి నాలుగువైపులా రింగ్‌రోడ్డు ఏర్పడి రవాణా వ్యవస్థ మెరుగుపడడంతో పాటు నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. సుమారు 5లక్షల జనాభాతో ఉన్న ఖమ్మం నగరంలో రింగ్ రోడ్డును అనసంధానం చేసుకుని అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు కూడా వెలిసే అవకాశం ఉంది.

అభివృద్ధే ఆశయంగా పనిచేస్తున్నా: మంత్రి

గత ఐదేళ్ల జిల్లాలో అభివృద్ధి స్థంభించిందని, మళ్లీ మంత్రిగా తనకు అవకాశం లభించడంతో అభివృద్ధిని మరింత వేగంగా చేసే అవకాశం వచ్చిందని, అందువల్లే అభివృద్ధే ఆశయంగా అనుకున్న పనులు సత్వరం పూర్తిచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నానని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. గతంలో ప్రతిపాదించిన జాతీయ రహదారులు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయని, ఆగస్టు 15నాటికి దేవరపల్లి-ఖమ్మంహైవే పూర్తి అవుతుందని, ఖమ్మం-కొరివి, నాగపూర్-అమరావతి నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఖమ్మం మెడికల్ కళాశాలను సూపర్‌స్పెషాలిటీ స్థాయికి అభివృద్ధి చేసే లక్ష్యంతో అధునాతన భవనాలు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలో కొత్తగూడెంలో ఎర్త్‌సైన్స్ యూనివర్శిటీ కూడా ఏర్పాటవుతుందని, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు కూడా రాబోతోందన్నారు. అలాగే భద్రాచలానికి రైలుమార్గం కూడా ఏర్పాటు కాబోతుండటంతో భద్రాచలానికి రోడ్డు మార్గంతో పాటు, రైలు, విమానమార్గాల్లో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరం నుంచి గోదావరిని జలమార్గంగా మార్చుచేసి జలరవాణా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ అభివృద్ధికి కొణిజర్ల వద్ద గోద్రెజ్ కంపెనీతో ఆయిల్‌పామ్ పరిశ్రమంతో పాటు సీడ్‌ప్రొడక్షన్ నర్సరీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

(5వ పేజీ తరువాయి)

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేద వాడికి భద్రత కల్పించేందుకు తమ ప్రభుత్వం ఎక్కడ రాజీ పడటం లేదన్నారు. తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని పేద పిల్లల డైట్ చార్జీలు, ఆడ బిడ్డలకు కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని గుర్తు చేశారు. ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం ఆశాజనకంగా లేకపోయినా వెసులుబాటు చేసుకొని సంక్షేమం అభివృద్ధి పథకాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఇప్పటి వరకు 57,620 ఉద్యోగాలు తమ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇవ్వడం జరిగిందని రాబోయే రోజుల్లో మరింతగా ఉద్యోగాలను ఇవ్వబోతున్నామని తెలిపారు. కాశ్మీర్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపామన్నారు. ముఖ్యంగా పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష నేత తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు అండగా నిలుస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో తమ సంఘీభావాన్ని తెలిపిందని మంత్రి పొంగులేటి అన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

భద్రాచలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీకారం చుట్టగా అలాగే గ్రంథాలయంలో నూతనంగా నిర్మించిన రీడింగ్ హాలును ప్రారంభించారు. భద్రాచలంలో రూ.1.24 కోట్లతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. అలాగే గ్రంథాలయ భవనంలో నూతనంగా సుమారు రూ.35 లక్షలతో నిర్మించిన రీడింగ్ హాల్‌ను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు, కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలి

» బీఎంఎస్ ప్రతినిధి బృందంతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఇల్లెందు, మే 7 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగానికి ఆయువుపట్టుగా ఉన్న బొగ్గు ఉత్పాదనలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి బీఎంఎస్ ప్రతినిధులను కోరారు. మంగళవారం రాత్రి న్యూఢిల్లీలో అఖిల భారతీయ ఖాదన్ ముగ్ధార్ సంఘం బీఎంఎస్ ప్రతినిధుల బృందం బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్రమంత్రిని బొగ్గు పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరింది. బీఎంఎస్ బొగ్గు పరిశ్రమ విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి సుజీత్, ఉపప్రధాన కార్యదర్శి అశీష్‌మూర్తి, బొగ్గు గని కార్మికుల పెన్షనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులిరాజారెడ్డిలతో కూడిన ప్రతినిధి బృందం మంత్రి కిషన్‌రెడ్డిని కలిసింది. ఈ మేరకు పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పులి రాజారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జాతీయ మహాసభ తీర్మానాలను అమలు చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ మేరకు సమస్యలు, తీర్మానాలతో కూడిన వినతి ప్రతాన్ని కేంద్ర మంత్రికి సమర్పించామని, బీఎంఎస్ నిర్ణయాలను పరిశీలించి అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీఎంఎస్ నాయకులు

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సమస్యల తిష్ఠ

» వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహపైనే ఆశలు



ఖమ్మం, మే 7(ఆంధ్రజ్యోతిప్రతినిధి): నిత్యం వేలాది మందికి వైద్యసేవలందిస్తున్న ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిని సమస్యలు పీడిస్తున్నాయి. మంత్రులు గురువారం నిర్వహించే సమీక్షతోనైనా ఈ ఆసుపత్రిలోని సమస్యలకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నారు. ఖమ్మం మెడికల్ కళాశాల ఆసుపత్రి(జిల్లా ఆసుపత్రి)లోని సమస్యలతో పాటు జిల్లాలోని ఇతర ఆసుపత్రుల్లోని సమస్యలపై మంత్రి తుమ్మల ఇప్పటికే అధికారులతో చర్చించి నివేదిక సిద్ధం చేశారు. గురువారం సమీక్ష సందర్భంగా వైద్యారోగ్యశాఖ మంత్రికి అ నివేదిక సమర్పించనున్నారు.

● ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో అన్ని విభాగాల్లో కలిసి 115మంది వరకు శాశ్వత వైద్యులు ఉండాలి. కానీ 80 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్ఆర్‌లు 59 మందికి గాను 28మంది మాత్రమే ఉన్నారు. గత ఏడాది ప్రభుత్వం స్టాఫ్‌నర్సుల నియామకం చేపట్టడంతో 203 మంది వచ్చారు. వీవీపీ పరిధిలో పనిచేస్తున్న వారు మరో 25మంది ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు 25మందికి ఐదుగురు మాత్రమే రెగ్యులర్ వాళ్లున్నారు. మిగిలిన వారంతా పొరుగు సేవల వాళ్లే ఉన్నారు.

● ఈ ఆస్పత్రికి అనుసంధానంగా డయాలసిస్ కేంద్రం ఉంది. కానీ ఇక్కడ కేవలం 20 పడకలు మాత్రమే ఉన్నాయి. వీటిని పెంచాల్సి ఉంది. అంతే కాకుండా నెఫ్రాలజిస్ట్ లేకపోవడం వల్ల అత్యవసర రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు.

● అత్యవసర సేవలు అందించే క్యాజువాలిటీలోనూ ఆరుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. దీంతో ప్రమాదాల బారిన పడి వచ్చిన రోగులకు అత్యవసర చికిత్సలు అందక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది.

● రేడియాలజిస్టులు మాత్రం ఒక్కరంటే ఒక్కరూ లేరు. ఈ విభాగం అంతా ఖాళీగానే ఉంది. సీటీ స్కానింగ్, ఎక్స్‌రే ప్లాంట్లు రెండు, టిపా స్కానింగ్, అల్ట్రా స్కానింగ్ ఉన్నా రేడియాలజిస్టులు లేకపోవడంతో ఎస్సార్లు ఇచ్చే నివేదికలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఓ ప్రైవేటు మెడికల్ కళాశాలలోని రేడియాలజిస్టులు ఇక్కడి విభాగంలో నివేదికలను ఇవ్వాల్సి వస్తోంది.

● గైనిక్ విభాగంలో 12మందికి గాను నలుగురు సెలవులో ఉంటున్నారు. జనరల్ మెడిసిన్‌లో 18మందికి ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. జనరల్ సర్జరీ విభాగంలోనూ 12మందికి 1అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. అనాటమీలో ఆరుగురు ఉండాల్సి ఉండగా ముగ్గురు, ఫిజియాలజీలో ఆరుగురికి ముగ్గురు, బయోకెమిస్ట్రీలో ఆరుగురికి ముగ్గురు, ఫార్మాలో ఆరుగురికి ముగ్గురు, మైక్రోబయాలజీలో ఆరుగురికి నలుగురు, సోషల్ ప్రివెంట్ మెడిసిన్‌లో ఆరుగురికి ఇద్దరు, పీడియాట్రీషిన్‌లో ఆరుగురికి నలుగురు మాత్రమే ఉన్నారు. గతంలో ఇక్కడ యూరాలజీ, ఈఎన్టీ, కార్డియాలజీ, రేడియోథెరఫీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎండో క్రైనాలజీ, న్యూరాలజీ విభాగాలలో విస్తృతంగా వైద్య సేవలు అందించినా ఇటీవల కొంత నిర్లక్ష్యం నెలకొంది.

● ఎంసీహెచ్ భవనం సామర్థ్యాన్ని పెంచాల్సి ఉంది. మరో అంతస్తు వేస్తే తప్ప ఇక్కడి మహిళలకు, రోగులకు ఇబ్బందులు తప్పేలా లేవు.

● ఏఎంసీ ఐసీయూలో 20, జనరల్ ఐసీయూలో 10 బెడ్లు మాత్రమే ఉన్నాయి. వీటిని 100 పడకలకు పెంచాల్సి ఉంది. వెంటిలేటర్లు కూడా ఐదు మాత్రమే ఉన్నాయి. వచ్చే రోగులకు ఇవీ ఏమాత్రం సరిపోవడం లేదు.

● అలాగే ల్యాప్రోస్కోపీ వంటి అధునాతన వైద్య పరికాలను కూడా జిల్లా ఆసుపత్రికి మంజూరుచేయాల్సిన అవసరం ఉంది. ల్యాప్రోస్కోపి ద్వారా శస్త్రచికిత్సలు చేసే సౌలభ్యం లేకపోవడంతో ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తోంది.

సమస్యలతో సతమతం...

ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కుగా 550 పడకల సామర్థ్యంతో ఖమ్మం జిల్లా ఆసుపత్రిని తీర్చిదిద్దారు. ఛత్తీస్‌గఢ్, ఏపీతో పాటు ఖమ్మం, సూర్యాపేట, కృష్ణా, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల నుంచి ప్రజలు అత్యవసర ఆరోగ్య సేవలకోసం ఇక్కడికి వస్తుంటారు. కానీ ఈ ఆసుపత్రిలో పూర్తిస్థాయి సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సీతారామ ప్రాజెక్టు నీళ్ల కోసం ఉద్యమం

» రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

పాల్వంచ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టు నీళ్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న పంట భూములకు మళ్లించే వరకు ఉద్యమం చేపట్టనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మండలంలోని జగన్నాధపురం ముంతాజ్ ఫంక్షన్‌హాలులో రైతు సంఘం, సీపీఎం పార్టీలు సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు మొదటి డిజైన్ ద్వార మూడున్నర లక్షల ఎకరాలకు నీరు మళ్లించే విధంగా రూపకల్పన చేశారని చెప్పారు. ప్రభుత్వం డిజైన్ మార్చి 2లక్షల ఎకరాలకు కుదిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మూడున్నర లక్షల ఎకరాల భూములకు నీళ్ల మళ్లించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, మచ్చ వెంకటేశ్వర్లు, మచ్చా వెంకటేశ్వర్లు, కొండబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడితో ఉలిక్కిపడ్డ ఏన్కూరు



ఏన్కూరు, మే7(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం గొత్తికోయల గ్రామం కొత్తమేడేపల్లి అడవుల్లో పశువుల కాపరిని ఎలుగుబంటి దాడిచేసి చంపేసిన ఘటనతో మండల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గిరిజన గ్రామాలప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏన్కూరు మండలం తల్లాడ రేంజ్ పరిధిలో నాచారం, మేడేపల్లి ప్రాంతాల్లో కనకగిరి గుట్టలున్నాయి. కనకగిరి గుట్టలు సమీప ప్రాంతాల్లో నాచారం, గంగులనాచారం , కాలనీనాచారం, రామతండా బద్రుతండా, మూన్యాతండా, ఒంటిగుడిసె గిరిజన గ్రామాలున్నాయి. వీరంతా ఎక్కువగా పశువులమేతకు, పొలాల సాగుకు కనకగిరి అడువుల వైపు వెళుతుంటారు. ఈఅడవుల్లో సుమారు 14 చిరుతపులులు, ఎలుగుబంట్లు, కొండగొర్రెలు, దుప్పులు. కణుజులు, జింకలు, కుందేళ్లు, అడవిపందులు, అడవిదున్నలు, అడవిబర్రెలు ఎక్కువగా ఉన్నా యి. ఇటీవల వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. అయితే ఎన్నడూలేని విధం గా ఒక్కసారిగా ఎలుగుబంటి దాడిచేయడంతో కనకగిరి గుట్టల ప్రాంతాల సమీప గ్రామాల ప్రజలు అటుగా వెళ్లడానికి భయపడుతున్నారు. ఈ ఏడాది రేపల్లేవాడ మిర్చి తోటలో చిరుత పులి సంచరించిన విషయం విధితమే. ఈసందర్భంగా తల్లాడ రేంజ్ ఎఫ్ఆర్‌వో ఉమా పశువుల కాపరులు దట్టమైన అడవుల్లోకి వెళ్లొద్దని సూచించారు. ఇదే అదునుగా భావించి వన్యప్రాణులను వేటాడే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విత్తన కంపెనీ ఏజెంట్‌పై ఆగ్రహం

» నగదు ఇవ్వడం లేదని సదరు కంపెనీపై రైతుల మండిపాటు

కొణిజర్ల, మే7(ఆంధ్రజ్యోతి): ఆడ, మగ మొక్కజొన్న పంటకు సంబంధించి ఓ విత్తన కంపెనీ ఏజెంట్ పంటను కొని డబ్బులు ఇవ్వడం లేదని పలువురు రైతులు ఆరోపించారు. సదరు కంపెనీ ఏజెంట్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని తెలుసుకొని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబుతో కలిసి చేరుకున్నారు. స్టేషన్‌లో ఏజెంటు ఉన్నాడని తెలిసిందని, సదరు ఏజెంట్ పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు ఎస్ఐను కోరారు. నెలరోజుల నుంచి పంటను కొని డబ్బులు ఇవ్వకుండా కనిపించకుండ ఉంటున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు కోట్లకు నష్టపోయారని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్ఐ సూరజ్‌ను వివరణ కోరగా కొణిజర్లతో పాటు వైరా, కామేపల్లి మండలాల రైతులు కంపెనీ ఏజెంట్ స్టేషన్ దగ్గర ఉన్నాడని వచ్చారన్నారు. ఏజెంట్, సదరు కంపెనీలపై రైతులు ఫిర్యాదు చేస్తే, విచారించి సదరు వ్యక్తులపై కేసునమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ఏజెంట్, కంపెనీకి సంబంధించిన వారు స్టేషన్ దగ్గరకు రాలేదన్నారు.


కొణిజర్ల పోలీస్‌స్టేషన్ దగ్గర ఉన్న రైతులు

కంపెనీ బాధ్యత వహించాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

రెండు కంపెనీలు ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకొని రైతుల దగ్గర నుంచి మొక్కజొన్నలను తీసుకెళ్లారు. రైతులకు మాత్రం నెలరోజులైన డబ్బులు ఇవ్వడంలేదు. రైతులకు సంబంధిత కంపెనీలు బాధ్యత తీసుకొని డబ్బులు చెల్లించనిచో, భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ఆయా కంపెనీలను అడుగుపెట్టకుండా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంకలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి): ఈడీసీ సెంటర్‌లో పని చేసేందుకు ఆసక్తి గలవారు మే 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ బ్యాంకు మద్దతుతో తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పనితీరును పెంచడం, వేగవంతం చేయడం కోసం (ఆర్ఏఎంపీ) ర్యాంప్ కార్యక్రమం కింద జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ వద్ద ఎంటర్ ప్రైజ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఈడీసీ) లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈడీసీ సెంటర్లు చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల మార్కెట్ పెంపు, రుణాల సమీకరణ, అభివృద్ధికి తోడ్పాటును అందిస్తాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలలో ఏర్పాటు చేసే ఈడీసీ కేంద్రాల వద్ద ఒక మేనేజర్, ఒక అసిస్టెంట్ మేనేజర్ లను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని దరఖాస్తులను ఆహ్వానిస్తుందని కలెక్టర్ తెలిపారు. మేనేజర్‌కు వయో పరిమితి 32 ఏళ్ల వయస్సు, 5 నుంచి 10 సంవత్సరాల అనుభవం, అసిస్టెంట్ మేనేజర్ కు 27 ఏళ్ల వయస్సు, 3 నుంచి 5 ఏళ్ల అనుభవం ఉండాలని అన్నారు. గ్రాడ్యుయేషన్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ మేనేజ్‌మెంట్, కామర్స్ లేదా ఇంజనీరింగ్ బ్యాక్ గ్రౌండ్‌తో పూర్తి చేసుకున్న అభ్యర్థులు మే 10 లోగా తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

రుగ్మతలను రూపుమాపిన రాఘవయ్య

సంస్మరణ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో సమస్త మానవాళి సమస్యలకు పరిష్కారం మార్క్సిజం అని, జీవితాంతం మార్క్సిజాన్ని నమ్ముకున్న వ్యక్తి రాఘవయ్య తుదికంటూ పోరాడిన వ్యక్తి, సమాజంలో ఉన్న రుగ్మతులను రూపుమాటానికి కృషి చేసిన వ్యక్తి రాఘవయ్య అని సీపీఎం కేంద్ర కమిటి సభ్యులు తమ్మినేని. వీరభద్రం అన్నారు. బుధవారం రావెళ్ల రాఘవయ్య సంస్మరణ సభ నగరంలోని శ్రీనివాసనగర్‌లో నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా తమ్మినేని. వీరభద్రం హాజరై మాట్లాడారు. వేలాదిమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్థిదిద్దారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముందుగా రాఘవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మంలో సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఎర్రా శ్రీకాంత్, యుటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు


ఖమ్మం లీగల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కుక్కలతండా, హమ్లెట్ మేకల తండా గ్రామానికి చెందిన నిందితులు బోడా రవి, ఇస్లావత్ కిషన్ అలియాస్ కిషన్ నాయక్, ఇస్లావత్ సేవాలకు హత్య కేసులో జీవితఖైదు శిక్షతో పాటు ఒక్కొక్కరికి ఐదువేల రూపాయలు జరిమానా విధిస్తూ మిగిలిన ఏడుగురు నిందితులైన బోడా బీత్రామ్, బోడా ప్రసాద్, ఇస్లావత్ పవన్, బోడా దుబ్లి, ఇస్లావత్ దేవి, ఇస్లావత్ కమ్లి, బోడా పార్వతి లకు గాయపరిచినందుకుగాను పదివేల రూపాయలు ఒక్కొక్కరికి జరిమానా విధిస్తూ బుధవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తిరుమలాయపాలెం మండలం కుక్కల తండా గ్రామానికి చెందిన ఫిర్యాది ఇస్లావత్ శిల్ప తండ్రి ఇస్లావత్ లచ్చిరాం మరియు ఆమె పెదనాన్న, బాబాయిలు తమ ఉమ్మడి ఆస్తిని గత 40 సంవత్సరాల క్రితం వారి తాత వద్ద నుంచి పంచుకున్నారని, అ భూమిలో 20 కుంటల భూమి ఫిర్యాది తండ్రికి తక్కువ వాటా వచ్చిందని కోర్టును ఆశ్రయించగా కోర్టులో సివిల్ దావా వేశారు. అట్టి సివిల్ దావా పెండింగులో ఉండగా 23 జూలై 2023న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మొదటి నిందుతుడైన బోడ రవి వివాదంలో ఉన్న భూమిలో అరక కట్టి దున్నుచుండగా ఫిర్యాది అన్నలైన ఇస్లావత్ బద్రు, ఇస్లావత్ బాలు, వదినలు విజయ, కవిత ఇతరులు పొలం దున్నవద్దని, వివాదంలో ఉందని అడ్డగించగా నిందితులు కర్రలు, రాళ్లతో ఫిర్యాది అన్నయ్య బద్రుని కొట్టగా కిందపడటంతో పాటు మిగిలిన వారిని సైతం బూతులు తిడుతూ కర్రలు, రాళ్లతో కొట్టడంతో బద్రు, బాలు, కవితలకు తలలు పగిలి గాయాలుకాగా అడ్డువచ్చిన వారిని సైతం తీవ్రంగా కర్రలతో కొట్టి గాయపరిచారు. గాయాలు తగిలిన వారిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన తరువాత ఫిర్యాది తిరుమలాయపాలెం పోలీసులకు అదే రోజు ఫిర్యాదుచేయగా నిందితులపై కేసునమోదు చేసినారు. 29జూలై2023న బద్రు ఆసుపత్రిలో మరణించటంతో పోలీసులు దర్యాప్తుచేసి నిందితులపై హత్య కేసు నమోదుచేసి కేసు విచారించి కోర్టులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్ వాదించగా లైజన్ ఆఫీసర్ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ ఎల్.బద్రాజీ సహకరించారు.

ఎక్స్‌కవేటర్, గోడ మధ్యలో ఇరుక్కుని వ్యక్తి మృతి

ఎక్స్‌వేటర్‌తో అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదం


శ్రీనివాసరెడ్డి (ఫైల్)


భద్రాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి): గుంతలో కూరుకుపోయిన ఇసుక టిప్పర్‌ను జేసీబీ సాయంతో ఇసుకను అన్‌లోడు చేస్తున్న క్రమంలో ప్రమాదుశాత్తు జేసీబీ తొండం (బకెట్), గోడ మధ్యలో ఇరుక్కుకుని భద్రాచలానికి చెందిన పగడాల శ్రీనివాస్‌రెడ్డి అలియాస్ అంబికా వాసు(45) మృతి చెందాడు. ఈ ఘటన భద్రాచలానికి సరిహద్దున ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం మేడివాయిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడివాయిలోని ఓ భవన నిర్మాణ పనులకు శ్రీనివాస్‌రెడ్డి ఇసుకను తెలంగాణలోని చర్ల నుంచి తరలించాడు. అయితే ఇసుక టిప్పర్ ఇసుకను లోడ్ చేసేందుకు వస్తున్న క్రమంలో గుంతలో కూరుకుపోయింది. దీంతో శ్రీనివాసరెడ్డి జేసీబీని తీసుకు వచ్చి టిప్పర్‌లోని ఇసుకను అన్‌లోడు చేస్తుండగా టిప్పర్‌తో పట్టుకోల్పోయి, జేసీబీ ఒక్కసారిగా అదుపుతప్పిం ది. ఆ సమయంలో వెనుక గోడ పక్కన ఉన్న శ్రీనివాస్‌రెడ్డి గోడ, జేసీబీ మధ్యలో ఇరుక్కుపోయాడు. వెంటనే అతన్ని భద్రాచలానికి వైద్యం కోసం తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


ఘటనా స్థలంలో టిప్పర్

వడదెబ్బకు వ్యక్తి మృతి

కల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో వడదెబ్బకు గురై బుధవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని యజ్ఞనారాయణపురం గ్రామానికి చెందిన ఎం.శేషాచార్యులు (59) తన ఇంటి నుంచి అవసరాల నిమిత్తం ఉదయం కల్లూరుకు వచ్చినట్లు తెలిసింది. ఆ క్రమంలో శేషాచార్యులు స్థానికంగా ఆర్డీవో కార్యాలయం ఎదురుగా గల పాఠశాల వద్దకు రాగానే వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు కల్లూరు పోలీసులకు సమాచారం.

బాధ్యతలు స్వీకరించిన ముఖ్య పరిపాలనాధికారులు


న్యాయాధికారికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం లీగల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కోర్టు ముఖ్య పరిపాలనాధికారిగా సంజయ్‌శేత్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో పనిచేస్తూ బదిలీపై ఖమ్మం వచ్చారు. కుటుంబ న్యాయస్థానం ముఖ్య పరిపాలనాధికారిగా పి.గోపాలకృష్ణ ఈయన రంగారెడ్డి జిల్లా కోర్టులో పనిచేస్తూ బదిలీపై ఖమ్మం వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిరువురు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు.

ఆర్‌టీఐ కన్వీనర్‌గా చంద్రశేఖర్‌గుప్తా

ఖమ్మం లీగల్, మే 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ హ్యూమన్‌రైట్స్ అండ్ ఆర్‌టీఐ కన్వీనర్‌గా ఖమ్మం బార్ అసోసియేషన్‌కు చెందిన కోన చంద్రశేఖర్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. కోన చంద్రశేఖర్ గుప్తా గతంలో ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. తన నియామకానికి సహకరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీనియర్ న్యాయవాదులు స్వామి రమేష్‌కుమార్, దండా సుధాకర్, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సింగం జనార్ధన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నిర్లక్ష్యానికి యువతి మృతి

సత్తుపల్లి మండలం కిష్టాపురం తండాలో ఘటన



సత్తుపల్లిరూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు కారణంగా వి ద్యుత్ ఇన్సూలేటర్ పగలడంతో వైర్లు తేగి పడగా వాటిని గమనించకుండా అటుగా వెళ్లిన పశువుల కాపరి అయిన యువతి విద్యుత్ షాక్ కు గురై అక్కకడికక్కడే మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గంగారం సబ్ స్టేషన్ ఏఈ కావ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపురం తండాకు చెందిన అవివాహిత భూక్యా బేబీ (25) పశువుల కాసేందుకు పొలాల్లోకి వెళ్లింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు విద్యుత్ స్తంబంపై ఉన్న ఇన్సూలేటర్ పగలడంతో వైరు తెగిపడటాన్ని గమనించని బేబీ ప్రమాదవశాత్తూ తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినది. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు.

వరిగడ్డి వాముల దగ్ధం

ముదిగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని రెండు వరిగడ్డివాములు దగ్ధమైన సంఘటన ముదిగొండ మండలం మాధాపురం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామంలోని మాదాసు నాగేశ్వరరావు, పడిశాల రామకృష్ణ అనే రైతులకు చెందిన 800 వరిగడ్డి మోపులకు ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. స్థానికులు స్పందించి మంటలను ఆర్పివేశారు. దగ్ధమైన వరిగడ్డి వాముల నష్టం విలువ రూ.50వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బోనకల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామ సమీపంలోగల సెయింట్‌మేరీస్ స్కూల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. చొప్పకట్లపాలేనికి చెందిన వడ్డేపూడి ఉపేంద్ర బోనకల్ నుంచి ఆటోలో తమ గ్రామానికి వెళ్తున్నాడు. అదే క్రమంలో ద్విచక్రవాహనంపై నల్లబోయిన ప్రవీణ్, షేక్.నజీర్‌లు ఆటోను ఢీకొట్టారు. ముగ్గురికి గాయాలయ్యా యి. 108సిబ్బంది ప్రథమ చికిత్స చేసి వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆళ్లపల్లి,మే 7(ఆంధ్రజ్యోతి) పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆళ్లపల్లి మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. ఆళ్లపల్లి ఎస్ఐ సోమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ఆళ్లపల్లి మండలం, మర్కోడు పంచాయతీ, పెద్దూరు గ్రామానికి చెందిన సంజీవరావు(26) అతిగా మద్యం సేవించి, ఇంట్లో పనిచేయడం లేదని కుటుంబ సభ్యులు మందలించారు. దాంతో సంజీవరావు క్షణికావేశంలో ఈ నెల 4న పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన సభ్యులు, మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. బుధవారం ఎస్ఐ సోమేశ్వర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగి..

కరకగూడెం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం పంచాయతీ అనంతారం గ్రామానికి చెందిన కొప్పుల సతీష్(34) అనే వ్యక్తి మద్యం మత్తులో పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. కరకగూడెం ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మద్యం మత్తులో మంగళవారం రాత్రి సతీష్ అనే వ్యక్తి పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలిస్తున్న క్రమంలో బుధవారం మహబుబాబాద్ గూడూరు వద్ద మృతి చెందడాని. మృతుడు తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు సతీష్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

17.5 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో బుధవారం కూనవరం రోడ్డులో తనిఖీ చేపట్టగా 17.5 కేజీల గంజాయిని అక్రమంగా ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రెండు మొబైల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కాగా పట్టుకున్న గంజాయి విలువ రూ.8.75 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై గౌతమ్, సిబ్బంది రామకృష్ణగౌడ్, హబీబ్ పాషా, వెంకటనారాయణ, సుమంత్, శ్రావణ్, పార్థసారధి, రమేష్ పాల్గొన్నారు.

ఏదులాపురంలో....

ఖమ్మం రూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా చెట్లపొదల్లో దాచిపెట్టిన 12 కిలోల గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న సంఘటన ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటి డంపింగ్ యార్డ్ ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే కరుణగిరి బైపాస్ రోడ్డు నుంచి మారెమ్మతల్లి ఆళయానికి వెళ్లే దారిలో కేంద్రియ విద్యాలయం పక్కన ఉన్న చెట్ల పొదల్లో 12 కేజీల గంజాయిని బస్తాలో మూటగట్టి ఉంచారు. ఇది గమనించిన స్థానికులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు చెట్ల పొదల్లో గాలించి గంజాయిని పట్టుకున్నారు. అయితే ఈ గంజాయిని ఎవరు, ఎక్కడి నుండి తీసుకువచ్చి ఇక్కడ దాచిపెట్టారు అనే విషయం మాత్రం తెలియలేదు. పట్టుకున్న గంజాయిని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమత్ మొతే పంచాయతీ గోళ్లగూడెం గ్రామం ప్రధాన రహదారి వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయిన సంఘటన కరకగూడెం మండలంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గొళ్లగూడెం గ్రామానికి చెందిన ఎల్లబోయిన కళ్యాణ్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో అదుపు తప్పి తాటిచెట్టును ఢీ కొనడంతో కళ్యాణ్‌కు కాలు తొడ, ఎముక విరిగి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో వ్యక్తికి స్వల్పగాయాలు అయ్యాయి. గ్రామస్థులు కరకగూడెం వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో మణుగూరు వైద్యశాలకు తరలించారు.

మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి

రఘునాథపాలెం, మే 7(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని వక్తలు గుర్తు చేశారు. అల్లూరి 100వ వర్ధంతి కార్యక్రమాన్ని రాంక్యాతండాలో ప్రగతిశీల యోజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ మాట్లాడుతూ అల్లూరి పోరాట చరిత్రను వివరించారు. రాష్ట్ర నాయకులు భరత్, లక్మన్, శివలాల్, శ్రీను, కేలోత్ భజన్, రమేశ్, రామ, పాపారావు, శ్రీను, వెంకన్న, బావ్‌సింగ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



గోడౌన్ వద్ద కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి): నెలవారి తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణంలో ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోడౌన్ రూం సీల్‌ను పరిశీలించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది షిఫ్టుల వారీగా డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులున్నారు.

పోలీస్ సిబ్బందికి ఏఎంబీఐఎస్ శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 7 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందికి ఏఎంబీఐఎస్(ఆటోమేటెడ్ మల్టీ మోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్) సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకునేందుకు బుధవారం ఒక్క రోజు శిక్షణ తరగతులను పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఏఎంబీఐఎస్ అనేది నేరం జరిగిన ప్రదేశాల నుంచి నేరస్థులు వేలి ముద్రలు, అరచేతి ముద్రలు, ఐరిస్ స్కాన్ డేటా ఆధారంగా నేరాలను గుర్తించటానికి ఒక అధునాతన నేర గుర్తింపు వ్యవస్థ అని క్లూస్ టీమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ అన్నారు. ఫింగర్ ఇంప్రెషన్, పామ్ ప్రింట్ ముద్రలను ఉపయోగించి నేరస్థులను గుర్తించటానికి తెలంగాణ పోలీసులు ఏఎఫ్ఐఎస్(ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్)ను ఉపయోగిస్తున్నారు.కొత్త క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) యాక్ట్ 2022 అమలులో భాగంగా తెలంగాణ పోలీసులు సాంకేతికతను ఆటోమేటెడ్ మల్టీమోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్‌కు అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు.

ఐదో వత్సరంలోకి కేఎంసీ పాలకవర్గం

అన్ని రంగాల్లో మహానగరాలకు దీటుగా

తనదైన మార్కు చూపుతున్న మంత్రి తుమ్మల

సమన్వయంతో వెళుతున్న మేయర్, కమిషనర్



ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగురాష్ట్రం నుంచి అటు రాజకీయాలైనా ఇటు అభివృద్ధైనా ఖమ్మానికి ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుంది. 2021 మే 7న ఖమ్మం నగర పాలక సంస్థ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. తొలి మహిళా మేయర్‌గా పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్‌గా ఫాతిమాజోహరా ప్రమాణ స్వీకారం చేశారు. నాల్గు ఏళ్ల కాలంలో ఖమ్మం నగరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులు మంజూరు జరిగాయి. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య సమన్వయంతో కలిసి పనిచేస్తుండటంతో నగరంలోని 60 డివిజన్లలో ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందుతున్నాయి. చివరి ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరం అభివృద్ధి కోసం ఇప్పటికే టీయూడీఎఫ్ఐసీ నుంచి రూ.వంద కోట్లు తెప్పించారు. ప్రతి డివిజన్‌కు నిధులు కేటాయించారు. విలీన ప్రాంతాలు, శివారు ప్రాంతాలకు ఎక్కువ నిధులు కేటాయించారు. సుందరీకరణలో భాగంగా అమృత్ 2.0 ద్వారా ఖానాపురం చెర్వు నుంచి దంసలాపురం వరకు అండర్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మాణం చేస్తున్నారు. నగరంలో తాగునీటి సమస్య లేకుండా అమృత్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి డివిజన్‌లోను మారుమూల ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు నిర్మాణం చేస్తున్నారు. పాలకవర్గం చివరి ఏడాదిలోను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనదైన మార్కును చూపుతూ ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు అనే విభేదాలు లేకుండా నిధులు మంజూరు చేయిస్తున్నారు. వారికి అధికారిక కార్యక్రమాల్లో సరైన ప్రోటోకాల్ అమలు చేస్తున్నారు. దీంతో ఖమ్మం నగరం రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో ముందుకు వెళ్తోంది.

ఆదాయ వసూళ్లలోను ఖమ్మంనగరం మహానగరాలకు దీటుగా వసూళ్లు చేస్తోంది. ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్, ఎర్లీబర్డ్ వసూళ్లు, ఎల్ఆర్ఎస్, సుడాలోను తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా తొలి మూడు స్థానాల్లో ఉంటుంది. కాగా ఆరు నెలల క్రితం ఖమ్మం మూడో డివిజన్ కార్పొరేటర్ మలీదు జగన్ గుండెసంబంధిత వ్యాధితో ఆకస్మిక మరణానికి గురైనారు. ఈ ఏడాదిలోపుగానే తిరిగి 3వ డివిజన్లలో ఎన్నికలు జరగనున్నాయి.

తలసీమియా పిల్లలకు అండగా ఉందాం

డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, మే 7 (ఆంధ్రజ్యోతి): 'తలసీమియాతో బాధపడుతున్న పిల్లలకు తల్లిదండ్రులతోపాటు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. బుధవారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని ఐఎంఏ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో తలసీమియా గురించి అప్పుడప్పుడు వినేవాళ్లమని, ఇప్పుడు ఈ తలసీమియాతో బాధపడే పిల్లలు ఎక్కువమంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలతో పాటు గ్రామాలు, పట్టణాల్లో తలసీమియాతో బాధపడే వారు ఎంతమంది ఉన్నారని, ప్రభుత్వం తరుపున సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. తలసేమియా పాజిటివ్ ఉన్న వారికి మందులు, చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తలసీమియా పిల్లల తల్లిదండ్రులు ఆందోళనకు గురి కావద్దని, ఎటువంటి సహకారం కావాలన్నా వైద్యశాఖ నుంచి అందిస్తామన్నారు. దంపతుల్లో ఇద్దరికి పాజిటివ్ ఉంటే పిల్లల్ని కనకుండా ఉండటమే మంచిదన్నారు. తలసీమియా దినోత్సవాన్ని నిర్వహించిన సంకల్ప స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అనితను డీఎంహెచ్‌వో అభినందించారు. ఏఆర్ ఏసీపీ ఎస్.నర్సయ్య మాట్లాడుతూ తలసీమియా చిన్నారులకు సేవ చేసే కార్యక్రమంలో తాము భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ తలసీమియా చిన్నారులకు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. చిన్నారులకు దాతలు అందిస్తున్న సహకారం వారి గొప్ప మనసును చాటుకుంటుందన్నారు. ఒలీవ్ క్రిప్టో సిస్టమ్స్ సీఈవో జి.భారవి మాట్లాడుతూ తలసీమియా చిన్నారులకు అండగా ఉండేందుకు తాను ఖమ్మం వచ్చినట్లు తెలిపారు.

చిన్నారులకు ఎల్లప్పుడు అండగా ఉంటూ సంకల్ప సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతానని తెలిపారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్‌లో ఎస్టీ కెటగిరీలో ఆల్ ఇండియా 21వ ర్యాంక్ సాధించిన తలసీమియా చిన్నారి అర్జున్‌ను, పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన చిన్నారులను ఘనంగా సత్కరించారు. సంస్థ బాధ్యురాలు ప్రొద్దుటూరి అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తలసీమియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంటరమణ, వైద్యులు డి.నారాయణమూర్తి, జంగాల సునీల్ కుమార్, కొల్లి అనుదీప్, సాయిబార్గవ్, జాబిశెట్టి రేణుక, లక్ష్మీదీప, వికాస తరంగిణి పోలా శ్రీనివాస్, వికాస తరంగిణి శాంతి, పులిపాటి ప్రసాద్, సంస్థ బాధ్యులు పావని, కస్తూరి, పి.రవిచంద్ర, పి.ఉదయ్‌భాస్కర్, పి.వంశీకిరిటీ, పి.ప్రియా, ఎన్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన మండలంగా..

రఘునాథపాలెం అభివృద్ధి: తుమ్మల



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మండలంగా రఘునాథపాలెం మండలాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని, గతంలో ఖమ్మం అర్బన్‌తో కలిసి ఉన్న ప్రాంతాలను తానే ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేశానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం రఘునాథపాలెంలో రూ.30లక్షలతో సీసీ రహదారులు, రూ.33 లక్షలతో నిర్మాణం చేయనున్న సహకార భవనాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిని తాను చూసుకుంటానని ప్రజలు తమ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రజలు అంగీకరిస్తే ప్రధాన రహదారులను విస్తరించేందుకు తాను నిధులు తీసుకొస్తానన్నారు. అమరావతి జాతీయ రహదారి భూ నిర్వాసిత రైతులకు మొదట్లో ఎకరానికి రూ.15లక్షలు మంజూరు జరిగితే తాను కొట్లాడి రూ.35 లక్షలు మంజూరు చేయించానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. ఖమ్మం ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, పీఏసీఎస్ ఛైర్మన్ తాతా రఘురాం, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఇంటికి మణిదీపాలు: కలెక్టర్



చిన్నారిని ఎత్తుకున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం, మే 7(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలు ఇంటికి మణిదీపం వంటి వారని, అమ్మాయి పుట్టటం అదృష్టమనే సమాజం రావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభిప్రాయ పడ్డారు. బుధవారం రఘునాథపాలెం మండలం జింకలతండాలో నిర్వహించిన మా పాపా.. మా ఇంటి దీపం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని బేగం షరీఫ్ దంపతుల చిన్నారి పాపను ఎత్తుకున్నారు. తల్లిదండ్రులను అభినందించారు. పాప తాతయ్య, నానమ్మ, బంధువులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముచ్చటించారు. ప్రస్తుత సమాజానికి ఆడ పిల్లల అవశ్యకతపై వివరించారు. ఆడ పిల్లలు మగ పిల్లలకు మించిన స్థాయిలో అన్ని రంగాల్లో ముందు ఉంటున్నారన్నారు. బాలికలను బాల్యం నుంచి ప్రోత్సహించటం ద్వారా వారిలో ఆత్మ స్థైర్యం పెరుగుతుందన్నారు. జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి, తహసిల్ధారు లూథర్‌విల్సన్ పాల్గొన్నారు.

'అంకుర'లో అరుదైన శస్త్రచికిత్స



చిన్నారి తల్లిదండ్రులతో వైద్యులు

ఖమ్మం, మే7(ఆంధ్రజ్యోతి): అంకుర ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి నెలరోజులు చిన్నారి ప్రాణాలు కాపాడారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన దంపతులకు నెలలు తక్కువగా పుట్టిన 30 రోజుల వయసున్న బాలుడికి బ్రెయిన్‌లో నరాలు చిట్లిపోయి తీవ్రంగా రక్తస్రావం అవుతోండగా సర్జరీ విజయవంతంగా పూర్తిచేసినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ జొన్నలగడ్డ వరుణ్, అంకుర ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ బృందం బుధవారం మీడియాకు తెలిపారు. బాలుడికి మెదడులో నరాలు చిట్లిపోయి తీవ్రంగా రక్తస్రావం జరగడంతో పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు వారు తెలిపారు. పలు ఆసుపత్రులకు తీసుకెళ్లినప్పటకీ బాలుడికి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలనీ వారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు తమ ఆసుపత్రిని ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. తమ ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక సర్జరీ పరికరాలతో వారిద్దరితోపాటుగా ఇతర డాక్టర్లు శ్వేత, అపర్ణ, జాకీర్, అనస్థిషియా వైద్యుడు కోటేశ్వరరావు సహకారంతో మూడున్నర గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్స పూర్తిచేసినట్లు వారు తెలిపారు.

కాగా బుధవారం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో పాటు పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ బాబుకు ప్రాణదానం చేసిన అంకుర ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులకు బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

యుద్ధ వాతావరణం సృష్టిస్తున్న మోదీ

మోదీ తీరు మార్చుకోవాలి: సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం



సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 7 (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడి తర్వాత దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని సరిహద్దుల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంటుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని తుద ముట్టించాల్సిదేనని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ మోదీ ఆలోచనలో ఎటువంటి మార్పు లేదన్నారు. ప్రజల గురించి కాకుండా సంపన్న వర్గాల గురించి మాత్రమే మోది ఆలోచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గించటం, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించటం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్తతను మత ఉన్మాదుల అవకాశంగా తీసుకోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయటంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయంలో న్యాయం చేయలేదన్నారు. కేవలం 40శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. కార్యక్రమాల నివేదికను పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్ ప్రవేశ పెటారు. రాష్ట్ర కంట్రోల్ కమిటీ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

అవసరాల మేరకు అంతర్గత రహదారుల విస్తరణ



విస్తరణపై ఆదేశాలిస్తున్న కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో ప్రజా రవాణా మేరకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రజాభీష్టం మేరకు రహదారుల విస్తరణ చేపట్టటం జరుగుతుందని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం రైల్వేస్టేషన్, కస్బాబజార్, పాత మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, ఇతర అంతర్గత ప్రధాన రహదారులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీ నివేదికల మేరకు రహదారులను 30 అడుగుల నుంచి 50 అడుగుల మేరకు వెడల్పు చేస్తున్నామని తెలిపారు. ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుందరతో రహదారుల వెడల్పు, ఆక్రమణలపై తనిఖీలు చేపట్టారు. రానున్న వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కావాల్సిన చర్యలను ఇప్పుడు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థలపై పరిశీలన చేశారు.

కేఎంసీ పారిశుధ్యానికి మరో వజ్రాయుధం

వాటర్ విత్ స్వీపింగ్ మిషన్..

రూ.1.85 లక్షలతో కొనుగోలు

ట్రయల్ రన్‌ను పరిశీలించిన కమిషనర్



రహదారులను శుభ్రం చేస్తున్న స్వీపింగ్ మిషన్

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 7(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న పారిశుధ్య అవసరాలకు తగిన విధంగా ఖమ్మం నగర పాలక సంస్థ ఆదునిక పారిశుధ్య వాహనాలను కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే గరుడ వంటి వాహనం గత నెల రోజులుగా ఖమ్మం నగరంలో పారిశుధ్య విభాగంలో కీలకంగా పనిచేస్తోంది. కాగా తాజాగా మెకానైజ్డ్ స్వీపింగ్ మిషన్‌ను రూ.1.85 లక్షలతో కేఎంసీ పాలకవర్గం కొనుగోలు ప్రక్రియ చేపట్టింది. దీంతో మైకానైజ్డ్ స్వీపింగ్ మిషన్ (వాటర్ విత్ స్వీపింగ్)ను బుధవారం ఖమ్మం నగరంలో ట్రయల్ రన్ చేపట్టారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బల్లేపల్లి వరకు రోడ్డు స్వీపింగ్ పనులు మిషన్‌తో ట్రయల్ రన్ చేపట్టారు. వాహనం పనితీరును కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు.

ఘనంగా వాసవి మాతకు పూజలు



ఖమ్మం గాంధీ చౌక్, మే 7(ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం సందర్భంగా బుధవారం వాసవి క్లబ్ ఖమ్మం, వాసవి క్లబ్ గాంధీ చౌక్ ఖమ్మం అధ్యక్షుడు పసుమర్తి రామ్మోహన్‌రావు, ధనారపు వాసవి ఆధ్వర్యంలో నగరంలోని రజక వీధి కనకదుర్గ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వాసవి అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులకి ప్రసాదం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ వీఎస్ కేసీజీఎఫ్ డైమండ్ స్టార్ కొత్త వెంకటేశ్వరరావు, డైమండ్ స్టార్ కేసీజీఎఫ్ కడవెండి శ్రీనివాస్, ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గోల్డెన్ స్టార్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, గుంటుపల్లి దివాకర్ గుప్తా, మా శెట్టి వరప్రసాద్, కొత్తూరి రమేష్, బూర్ల పుల్లారావు, బచ్చు మురళీకృష్ణ, సరిత, ఉమారాణి, భవాని వీణ, సురేఖ, చీకటిమల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ఉద్యమాలకు సిద్ధం కావాలి: సరళ



మాట్లాడుతున్న సరళ

నేలకొండపల్లి, మే7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించటానికి పార్టీ శ్రేణులు సర్వదా సిద్ధంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం నేలకొండపల్లి రావెళ్లభవన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎంపీఓకు వినతిపత్రం అందించిన అనంతరం పగిడికత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన రావెళ్లభవన్‌లో జరిగిన మండల పార్టీ సర్వసభ్య సమావేశంలో సరళ మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున రానున్న రోజుల్లో సంక్షేమ పథకాల అమలు కష్టంగా మారనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ చేసిన ప్రకటన ఆయన అసమర్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు తెలుసుకోక ముందే ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని రైతులు, కార్మికులు, ఉద్యోగులు, కూలీలు మనో ధైర్యం కోల్పోయేలా ముఖ్యమంత్రి మాట్లాడటం సమంజసం కాదన్నారు. అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన వారికే అందేలా చర్యలు చూడాలని, లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని సరళ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, నాయకులు బషీరుద్దీన్, రామారావు, అశోక్, లెనిన్, కృష్ణ, భాస్కర్, ప్రమీల, సామాల మల్లికార్జున్, రచ్చా నర్సింహారావు, కేవీ చారి, దుగ్గి వెంకటేశ్వర్లు, రాసాల కనకయ్య, మారుతి కొండలరావు, పెద్దిరాజు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారులపైనే మురుగు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
» పట్టించుకోని అధికారులు

వైరా, మే 7 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో దాదాపు ఏడాది కాలం నుంచి మురుగునీరు ప్రవహిస్తూ ముక్కులు పగిలిపోయేలా దుర్గంధం వెదజల్లుతుంది. అయినప్పటికీ ఈ సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యారు. వైరాలోని ఏసీపీ, ఎంవీఐ, తహసీల్దార్ కార్యాలయం అలాగే ఉమ్మడి జిల్లాకు మద్యాన్ని సరఫరా చేసే ఐఎంఎల్ డిపో, తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలకు ఎదురుగా ఉన్న జాతీయ ప్రధాన రహదారికి రెండోవైపు ఉన్న ఒక అపార్టుమెంట్‌లోని నివాసాల నుంచి వచ్చే వ్యర్థ నీరు రోడ్డు పక్కనే డ్రెయినేజీలా ప్రవహిస్తుంది. అయినప్పటికీ మునిసిపల్ శాఖ అధికారులు ఈ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. నేషనల్ హైవే, మునిసిపల్ అధికారుల మధ్య పూర్తిగా సమన్వయం కొరవడింది. ఒక అపార్టుమెంట్‌లోని నివాసాల నుంచి వచ్చే వ్యర్థనీరు ఎటూ వెళ్లకుండా అపార్టుమెంట్‌కు రెండువైపులా ఉన్నవారు అభ్యంతరాలు చెపుతున్నప్పటికీ ఈ సమస్యను ఏవిధంగా పరిష్కరించాలనే విషయమై అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నేషనల్ హైవే పక్కన నిలిచిన డ్రెయినేజీ మురుగునీరు

తాత్కాలిక ఉపశమనంగా అపార్టుమెంట్ ముందు ఒక గుంత తవ్వించి దానిలోకి మురుగునీటిని పంపుతున్నారు.

పూర్తిగా గుంత నిండిన తర్వాత మురుగునీరు మొత్తం రోడ్డు పక్కనే డ్రెయినేజీ మాదిరిగా ప్రవహిస్తుంది. ఆపక్కనే ఉన్న పెట్రోల్ బంకు, చిరువ్యాపారుల దుకాణాల్లోకి చేరుతుంది. భరించలేని విధంగా దుర్వాసన వెదజల్లుతుంది. రోడ్డుపైన వెళ్లే వాహనాలు ఒక్కోసారి ఈ మురుగునీటిలోనుంచే ప్రయాణిస్తుండటంతో వాహనాల టైర్ల వెంట మురుగునీరు లేచి పక్కనే వెళ్తున్న ఇతర వాహనచోదకులు, పాదచారులపై పడుతుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మునిసిపల్ అధికారులకు ఇతరత్రా పనులపై ఉన్న శ్రద్ధ ప్రజలకు మురుగుకూపం నుంచి విముక్తి కల్పించడంలో చొరవ చూపడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల పరిశీలన



కుప్పెనకుంట్లలో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

పెనుబల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల గృహాలను కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ బుధవారం పరిశీలించారు. మండలంలోని రామచంద్రరావుబంజర్, కుప్పెనకుంట్ల, కేడబ్యూచౌడవరం, తాళ్లపెంట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హత ఉన్నవారిని ఎంపిక చేసేశారా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీవో అన్నపూర్ణ, పాల్గొన్నారు.



కారేపల్లిలో..

తల్లాడలో..

తల్లాడ: మండలంలో ఇందిరమ్మ పథకానికి ఎంపికైన లబ్ధిదారుల ఇళ్లను బుధవారం ఆర్డీవో రాజేంద్రగౌడ్ పరిశీలించారు. మండలంలోని బిల్లుపాడు, వెంగన్నపేట, రేజర్ల, తెలగవరం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఎంపికైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి కుటంబ పరిస్థితి, నిర్దేశించిన ఇళ్ల స్థలాలను ఆయన పరిశీలించారు ఈకార్యక్రమంలో ఎంఆర్ఐ ఖాజా మోహిద్దీన్, పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన ఇండ్ల నిర్మాణాల ప్రాంతాలను మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ బాబు, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్ర ప్రసాద్‌లు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా గిద్దవారిగూడెం, మాణిక్యారం, మంగలితండా, గుట్టకిందగుంపు, కొత్తతండా పంచాయతీలలో మంజూరైన వారికి సంబంధించిన వారి ఇళ్లను పరిశీలించారు. మంజూరైన ఇంటి లబ్ధిదారులు ప్రభుత్వం సూచిన ప్రకారమే ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు.

చిన్నారులకు టీకాలే ఆరోగ్య రక్ష

» జిల్లా వాక్సిన్ మేనేజర్ రమణ



వాక్సిన్లను పరిశీలిస్తున్న డీవీఎల్ఎం రమణ

కల్లూరు, మే7 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు టీకాలే ఆరోగ్య రక్ష అని జిల్లా వాక్సిన్ మేనేజర్ సీహెచ్‌వి. రమణ అన్నారు. బుధవారం మండలంలోని కల్లూరు, చెన్నూరు ప్రభుత్వ ఆస్పతులలోని టీకాల కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వాక్సిన్ల ఉష్ణోగ్రత, వీవీఎం ఓపెన్ వైల్ పాలసీ రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నూరు శాతం టీకా లక్ష్య సాధన దిశగా పనిచేయాలని కోరారు. కలూరు ఆసుపత్రిలో నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు టీకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నవ్యకాంత్, ఇష్రావత్ తబుసుం, సుపర్వైజర్లు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గీతామందిరంలో పూజలు

సత్తుపల్లి, మే7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంచేసియున్న గీతాజ్ఞానమందిరంలోని ఏకోనవింశతి (19వ) అధ్యయనోత్సవ సహిత రుక్మిణీ సత్యభామ సమేత పార్థసారధి స్వామి వారి బ్రహోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మిక వేత్త శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణీ సత్యభావ సమేత పార్ధసారధి స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాంకేతికతను పెంపొందించుకోవాలి

కొణిజర్ల, మే7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలని విజయ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి ఆవిష్కార్-2క25 టెక్నికల్ సోసిజం అండ్ కల్చరల్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి, సాంకేతిక అవగాహన పెంచుకోవడానికి ఇంటువంటి ఫెస్ట్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఆయేషాతరుణం, కళాశాల డీన్ శ్రీనివాసరావు, ఏవో ఫరీద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



సాయం అందిస్తున్న సభ్యులు

తల్లాడ, మే7(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో గ్యాస్ లీకై నలుగురిని కోల్పోయిన బాధిత కుటుంబానికి ఎంఎంహెచ్ హెచ్ ఫౌండేషన్ తరుపున రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. బుధవారం గ్రామంలో గుత్తికొండ వినోద్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎ హెచ్‌హెచ్ సంస్థ బాధ్యులు వడ్డాణపు నరేష్, శ్రీకాంత్, బ్రహ్మం, అజయ్, మారేష్ పాల్గొన్నారు.

కల్లూరులో గాలిదూమరం



వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ సుజాత

కల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, ఆకాల వర్షంతో పలు గ్రామాల్లో విద్యుత్ స్తంబాలు విరిగాయి. ఆరు ఇళ్లు పాక్షికంగా, మరో మూడు ఇళ్లు పూర్తిగా పడిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు స్తంబాలు విరగడంతో రూ.80 వేలు నష్టం జరగగా, గృహాలు కూలిపోవడంతో సుమారు రూ.6 లక్షల వరకు బాధితులకు నష్టం వాటిల్లిందని తెలిసింది. ఈ మేరకు మండల రెవెన్యూశాఖ తరుపున పంచనామా చేసి వివరాలను సేకరించారు. విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో ఏఈలు రామిరెడ్డి, వెంకట్‌ల పర్యవేక్షణలో కొత్త స్తంబాలు వేసి విద్యుత్ సరఫరాను మెరుగు పరిచారు.

మధర్‌థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): గత ఫిబ్రవరిలో 2024-25విద్యా సంవత్సరానికి గానూ మిస్ట్ అటానమస్ హోదాలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలలో మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హవా కొనసాగించారు. బుధవారం విడుదలైన ఫలితాలలో ప్రతిభ కనబరిచిన వారిలో.. సీఎస్సీలో అంబటి సత్యశ్రీ, కటారు వేహశ్రీవల్లి, దోసపాటి హర్షిత, మేకల ప్రవళిక, సీఎంఎంలో మలిశెట్టి భవానీ, నూరనేని అఖిల, పగిడిపల్లి సెరనారోసిలిన్, పంచి రోజా, చీపు దర్శిణి, లక్కదాసు స్వాతి, రాపోలు నాగహిందుమతి, సీత్రాల గౌతమి, పగిలి పల్లవి, ఈసీఈ నుంచి నాయుడు రుచిత, షేక్ ఇజాజ్, తొర్లపాటి జ్యోతి, ఈఈఈలో మహమ్మద్ సామ్‌రాహమహెక్, అలవాల భావనశ్రీ, మిరాజ్ హమేరా, సివిల్ ఇంజనీరింగ్‌లో సయ్యద్ రహిమ్, బెజవాడ మోహిత్ కృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, అకడమిక్ డైరెక్టర్ డా.ఏబీ.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ డా.జాకీర్‌హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డా.ఎంవీ.రామచంద్రరావులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మధిరటౌన్, మే7(ఆంధ్రజ్యోతి): మధిర బంజార కాలనీ శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస అనంతాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారు అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుర్రం ప్రమీల, రామారావు దంపతుల స్వగృహంలో వరపూజ, ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లాది వాసు, కళ్యాణపు పుల్లారావు, గొండేల ముత్తయ్య, నాగిరెడ్డి, కోనేరు లీలాశంకర్, కటకం నరసింహారావు, చీదిరాల సత్యనారాయణ తదితరులున్నారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన వేంకటేశ్వరస్వామి దేవాలయం



ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు



విరాట్‌నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి 322వ జయంతి ఆరాధాన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర శత నామావళి, జీవసమాధి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మొగుదుంపురం రామకృష్ణమాచార్యులు, కోడూరు మోహనాచారి, మేడిది సత్యనారాయణ, మునగాల వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, కోమల రవి, గురుబ్రహ్మాచార్యులు, అప్పలాచారి, అప్పారావు, రాంబాబు పాల్గొన్నారు.

వైరా, మే 7 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్షల నర్సింహాచారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. చింతోజు నాగేశ్వరరావు దంపతులు తమ ఇంటి నుంచి స్వామివారి చిత్రపటాన్ని ఊరేగింపుగా మందిరానికి తీసుకొని వచ్చారు. తూమాటి వీర బ్రహ్మచారి, శ్రీరాములు, బండారు అనంతాచారి, పర్వతాచారి, తాటికొండ నాగేశ్వరరావు, శోభనాచారి, రంగు శ్రీనివాసాచారి, యలగందుల రమాచారి, సుబ్బారావు, కృష్ణ, మోదేపల్లి అప్పారావు, పాపాచారి పాల్గొన్నారు.

బోనకల్, మే 7 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో బుధవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు రావూట్ల వెంకటాచారి, జిల్లా గౌరవాధ్యక్షుడు రావూట్ల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పంతంగి శ్రీనివాసరావు, సతీష్ చంటి, రామాచారి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.



వైరాలో ఆరాధన మహోత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదర్శప్రాయుడు లక్ష్మీనారాయణ

కొణిజర్ల, మే7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన చింతనిప్పు లక్ష్మీనారాయణ ఆదర్శప్రాయుడని సీపీఐ జాతీయ సభ్యులు భాగం హేమంతరావు కొనియాడారు. బుధవారం చిన్నమునగాల గ్రామంలో లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలామల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా నాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్, నాయకులు సుదర్శన్, రమేష్, భద్రయ్య, సొసైటీచైర్మన్ చెరుకుమల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సుశీలమ్మ ఆశయాలు సాధించాలి

బోనకల్, మే 7 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ తూము ప్రకాశరావు సతీమణి సుశీలమ్మ ఆశయాలు సాధించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. బుధవారం రాయన్నపేట గ్రామంలో తూము ప్రకాశరావు భవన్‌లో పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాయన్నపేట గ్రామంలో జరిగే సుశీలమ్మ సంస్మరణ సభకు ప్రజలు తరలిరావాలని కోరారు. సంస్మరణ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్‌రావుతో పలువురు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తూము రోషన్‌కుమార్, కోటయ్య, పూర్ణచంద్రరావు, ఆనందరావు, వీరభద్రం, సత్యం, కొండల్‌రావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

ఫార్మర్ రిజిస్ట్రీ కార్డును తీసుకోవాలి

» వైరా ఏడీఏ కరుణశ్రీ

వైరా, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రిజిస్ట్రీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ సూచించారు. మండలంలోని తాటిపూడి, గొల్లెనపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఏవో మయాన్ మంజూఖాన్‌తో కలిసి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు గుర్తింపు కార్డు కోసం ఏఈవోల వద్ద తమ వివరాలను రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి: రైతు సంఘం

వైరా, మే 7 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తల్లడిల్లుతున్న ధాన్యం రైతుల గోస పట్టించుకొనే నాథుడే కరువయ్యారని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ధ్వజమెత్తారు. వైరా ఏఎంసీతో పాటు గొల్లెనపాడు, అష్ణగుర్తి పలు గ్రామాల్లో భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యాన్ని రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కిలారు శ్రీనివాసరావు, హరి వెంకటేశ్వరరావు, సామినేని రవి, మాడపాటి మల్లికార్జున్, వెంకట్, చింతనిప్పు మురళీధర్‌రావు పాల్గొన్నారు.

వైరా లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

వైరా, మే 7 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ 20వ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏడునూతల బుచ్చిరామారావు, ఉపాధ్యక్షులుగా రంగా సత్యనారాయణ, ఏపూరి రాజారావు, సెక్రటరీగా చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా గద్దే నీరజ, జీఎస్టీ కోఆర్డినేటర్‌గా హనుమాయమ్మ, జీఎంటీ కోఆర్డినేటర్‌గా కొల్లా రాంబాబు, జీయూపీ కోఆర్డినేటర్‌గా షేక్.లాల్‌మహ్మద్, క్లబ్ పీఆర్వోగా పులి కృష్ణార్జున్‌రావు ఎన్నికైనట్లు ప్రస్తుత అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు తెలిపారు.

అడ్మిషన్ల పెంపుపై విస్తృత ప్రచారం

ఏన్కూరు, మే7(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం అడ్మిషన్ల పెంపుపై విస్తృత ప్రచారం చేపట్టింది. ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం ఆధ్వర్యంలో ఏన్కూరు, జూలూరుపాడు, తల్లాడ మండలాల్లోని 16పాఠశాలల విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు గురించి వివరిస్తున్నారు. బుధవారం జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు, రాజారావుపేట, బొజ్జతండా, అన్నారపాడు, గుండ్లరేవు, బేతాళపాడు, కాకర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు సుందర్, కృష్ణప్రసాద్, బాబులాల్, రామారావు, వెంకటేశ్వరరావు విజయలక్ష్మి, లక్ష్మీనరసింహ, రమాదేవి, కిషోర్, రాజన్న, శివ, కవిత, నవీన్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై చర్యలు

కల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లయ్యబంజర ఐకేపీ ధాన్యం కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటూ ఈ మేరకు జిల్లా డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పుల్లయ్యబంజర ఐకేపీ కేంద్రంలో రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోళ్లు జరపకపోవడం, మిల్లుల ధాన్యం తరలింపులో నిర్దిష్ట ప్రమాణాలు పాటించక పోవడం, రైతులు రోడ్డెక్కి ఆందళనకు దిగడం తదితర కారణాలతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తీవ్రంగా పరిగణించారు. పుల్లయ్యబంజర కేంద్రంలో వాస్తవ పరిస్థితిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఈ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న సీసీతో పాటుగా వీవోను, కమిటీ సభ్యులపై చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐకేపీ సీసీ, వీవోను బాధ్యులను చేస్తూ సస్పెన్షన్ చేయగా, వీవోఏల కమిటీలోని కొంత మంది సభ్యులను విధుల నుంచి తొలిగించారు. ఈ విషయంపై కల్లూరు ఏపీఎం రాంబాబు ధృవీకరించారు.

ఆడపిల్లలను అదృష్టంగా భావించాలి

సత్తుపల్లిరూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): తల్లీదండ్రులు ఆడపిల్లలను అదృష్టంగా భావించాలని మండల స్పెషలాఫీసర్ పీ.సునీల్‌రెడ్డి అన్నారు. మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా స్థానిక సింగరేణి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన పోతినేని బేబీ, సుధాకర్ దంపతులను బుధవారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాజలం, రజిని, టీచర్ రజని, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచలక గ్రామంలో మాఇంటి-మణిదీపం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన కొలగాని సుకన్య, శ్రీకాంత్ దంపతులను పూలమాలు, శాలువాలతో సన్మానించి స్వీట్ బాక్సు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో మెహరున్నీసాబేగం, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, కార్యదర్శి రాజేష్, పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్: ఆడపిల్ల తోనే ఇంటికి సౌభాగ్యం అని ఆడపిల్ల ఉన్న ఇంట్లో లక్ష్మీదేవి ఎల్లప్పుడు కొలువై ఉంటుందని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో బాగంగా మధిర పట్టణంలో లడకబజార్ లో ఇటీవల ఆడపిల్ల కు జన్మనిచ్చిన షేక్ సుభాని, కరిష్మ దంపతుల ఇంటికి వెళ్లి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో బాలత్రిపుర సుందరి, సూపర్‌వైజర్లు జ్యోతి కుమారి, సుజాత కుమారి, వార్డ్ ఆఫీసర్ గౌసియాబేగం పాల్గొన్నారు.



మధిరటౌన్‌లో తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

కారేపల్లిలో...

కారేపల్లి: మండల పరిధిలోని రావోజితండాలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సన్మానించారు. మండల ప్రత్యేక అధికారి నవీన్‌బాబు, ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీవో రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లిలో...




సత్తుపల్లిరూరల్‌లో..



కారేపల్లిలో...

అస్తమయంలో అందంగా...



ముదిగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలను హడలెత్తించిన సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో సాయం సంధ్యవేళలో ఇలా అందంగా కన్పించాడు. బుధవారం సాయంత్రం ముదిగొండ మండలం బాణాపురంలోని పాండవుల మర్రి సమీపంలో ఈ చిత్రాన్ని 'ఆంధ్రజ్యోతి' తమ కెమెరాలో క్లిక్ మన్పించింది.